శివారు సాగు ప్రశ్నార్థకం!

- పూడిక తొలగింపుపై అలముకున్న నిర్లక్ష్యం
- అమలాపురం, ముమ్మిడివరం నియోజవర్గాల్లో అధికం
- రబీ సాగుకు అవరోధం
- సాగునీటికి తప్పని తిప్పలు

ఐ.పోలవరం: కోనసీమ జిల్లాలో శివారు వరి ఆయకట్టు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో అమలాపురం, ముమ్మిడివరం ముందు వరుసలో నిలుస్తాయి. ఈ నియోజకవర్గాల పరిధిలో తాళ్లరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం ప్రాంతాల్లో సముద్రతీరం ఎక్కువగా ఉంది. ఇక్కడ వరి ఆయకట్టు అధికం. అమలాపురం, ముమ్మిడివరంలో మెరక ప్రాంతాలు అధికం. ఈ కారణంగా రబీ సమయంలో తమ చేలల్లో నీరు పారించేందుకు రైతులు ప్రతి ఏటా పడరాని పాట్లు పడుతుంటారు.

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలలో సుమారు 50,632 ఎకరాల్లో వరి ఆయకట్టు ఉంది. అమలాపురం నియోజకవర్గ పరిధి అమలాపురం మండలంలో 5,866 ఎకరాలు, అల్లవరంలో 4,855, ఉప్పలగుప్తంలో 7,434 ఎకరాల్లోను, ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలో ముమ్మిడివరంలో 7,305, ఐ.పోలవరంలో 9,040, కాట్రేనికోనలో 7,632, తాళ్లరేవులో 8,500 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు జరుగుతోంది. దీనిలో 20 శాతం అంటే సుమారు 10 వేల ఎకరాల్లో రైతులు ముంపునకు భయపడి ఖరీఫ్ సాగుకు దూరంగా ఉన్నారు. కాని మొత్తం ఆయకట్టులో రబీ సాగు చేస్తారు.

కాలువలే ఆధారం

రెండు నియోజకవర్గాలకు డెల్టా కాలువలే ఆధారం. అమలాపురం, నడిపూడి- అల్లవరం, ముక్తేశ్వరం బ్యాంకు కెనాల్‌తో పాటు కోరంగి ప్రధాన పంట కాలువల ద్వారా సాగునీరందుతోంది. ప్రధాన పంట కాలువలు, వాటికి అనుబంధంగా ఉన్న చానళ్లు, పంట బోదెలు అధ్వానంగా ఉన్నాయి. ఇవన్నీ తూడు, గుర్రపుడెక్కతో పూడుకు పోతున్నాయి. కొన్ని చోట్ల కాలువల స్వరూపం మారిపోతోంది. భారీ వర్షాలు కురిసే ఖరీఫ్ సమయంలోనే శివారుకు నీరందడం లేదు. ఇక రబీ సాగు సమయంలో అందుతుందనే నమ్మకం రైతులకు కలగడం లేదు. రబీలో ఫిబ్రవరి, మార్చి కాలంలో నీరందక రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మోటార్లతో డ్రెయిన్ల నుంచి నీరు తోడుకుంటున్నారు.



పూడుకుపోయిన తాళ్లరేవు మండలం పోలేకుర్రు పంట కాలువ



శివారుకు సాగు నీరందించే ఉప్పలగుప్తం చానల్ దుస్థితి

మరమ్మతుల ఊసే లేదు

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పంట కాలువలకు కనీస మరమ్మతులు లేకుండా పోయాయి. పూర్తి స్థాయిలో నీరు విడుదల చేసినా శివారుకు చేరే అవకాశం లేదు. దీంతో వచ్చే రబీలో రైతులు సాగు నీటికి మరిన్ని తిప్పలు పడాల్సిన దుస్థితి. ఇక్కడ డిసెంబరు 1 నుంచి రబీ మొదలు కానుంది. ఖరీఫ్‌లో సాగు చేయని రైతులు ముందస్తుగా రబీకి సిద్ధమవుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సాగునీటి పారుదల శాఖ అధికారులు ముందుగా మేల్కొని పంట కాలువలలో పూడికతో పాటు తూడు, గుర్రపుడెక్క తొలగించాలని రైతులు కోరుతున్నారు.



ఐ.పోలవరం మండలం కేశనకుర్రు-తిల్లకుప్ప ప్రధాన పంట కాలువ

చివరి పంటలకు సాగునీరు అందడం లేదు

ఏటా రబీలో నీటి ఎద్దడి తప్పడం లేదు. ఈ సమయంలో వంతుల వారీగా నీరు ఇస్తున్నారు. కాలువలకు నీరు పూర్తిగా ఇస్తున్నా పూడుకుపోవడం వల్ల పంటలకు నీరందడం లేదు. తక్షణమే పంట కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టాలి.

– యనమదల బాలయ్య, రైతు, తిల్లకుప్ప, ఐ.పోలవరం మండలం.



క్లుప్తంగా

జీతాలు ఇప్పించండి మహాప్రభో!



ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందిస్తున్న 104 ఉద్యోగులు

అల్లవరం: మూడు నెలలుగా జీతాలు లేక కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని తక్షణం తమకు బకాయి జీతాలు చెల్లించాలని 104 ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అల్లవరం మండల 104 ఉద్యోగులు ఆందోళనను కొనసాగిస్తూ ఎంపీడీఓ కృష్ణమోహన్, తహసీల్దార్ నరసింహారావులకు శుక్రవారం వినతిపత్రాలు అందించారు. ఉద్యోగుల నుంచి వసూలు చేస్తున్న పీఎఫ్ మొత్తాన్ని అరబిందో యాజమాన్యం ఉద్యోగులకు చెల్లించకుండా మోసం చేస్తోందన్నారు. ఉద్యోగులకు మెడికల్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని, అరబిందో యాజమాన్యం బకాయిలను చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అపరిచితులతో జాగ్రత్తగా మెలగండి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై శేఖర్‌బాబు

అమలాపురం రూరల్: ఎవరైనా మహిళలు, విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, ర్యాగింగ్‌కు పాల్పడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అమలాపురం తాలూకా ఎస్సై శేఖర్‌బాబు సూచించారు. జనుపల్లి మన్నా కాలనీలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహంలో శుక్రవారం మహిళా సంరక్షణపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అపరిచితులతో జాగ్రత్తగా మెలగాలన్నారు.

దివ్యాంగులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం శ్రీ కృష్ణదేవరాయ కల్యాణ మండపంలో శుక్రవారం విభిన్న ప్రతిభా వంతుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాలకు చెందిన సుమారు 528 మంది దివ్యాంగులకు ఎలెన్కో సంస్థ వైద్యులు పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు తాడి వెంకటాచార్య, డీఎల్ఎస్ శర్మ, ఎస్వీ చలం, కే.సత్యనారాయణ, నగర పంచాయతీ కమిషనర్ పీవీ సుధాకర్, సీఆర్ఓ వై.శ్రీరామ్, వివిధ శాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం



కాట్రేనికోనలో అవగాహన ర్యాలీ

కాట్రేనికోన: కాట్రేనికోన సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో క్యాన్సర్ పరీక్షలపై పీహెచ్‌సీ వైద్యులు ఎం లిఖిత, నీలిమలు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. క్యాన్సర్ మహమ్మారిని తరిమి కొట్టాలంటే ప్రతి ఒక్కరూ ముందస్తు పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం కళాశాల నుంచి కాట్రేనికోన గేట్ సెంటరు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన లేకపోవడంతో అధిక శాతం మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె రవి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగరాజు, అధ్యాపకులు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఆందోళన

అమలాపురం రూరల్: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో అమలాపురం మండలం ఈదరపల్లిలో నాయకులు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ముట్టడించారు. జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో సామాన్య ప్రజలపై భారం మోపిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం చార్జీలు పెంచమని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే గ్రామ స్థాయిలో ప్రజలతో కలిసి అసెంబ్లీ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, అమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిని, పీసీసీ మాజీ అధికార ప్రతినిధి ముషిణి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి



ముమ్మిడివరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

ముమ్మిడివరం: పేద ప్రజలకు న్యాయస్థానాలు అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహంతుల్లా పేర్కొన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో జాతీయ న్యాయ సేవా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలపై అవగాహన కల్పిస్తూ అధికరణ 39(ఏ) ప్రకారం పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించడానికి ఆయా కోర్టుల పరిధిలో న్యాయ సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం న్యాయ సేవా దినోత్సవం విశిష్టతను వివరిస్తూ కోర్టు ప్రాంగణం నుంచి బల్లగేటు సెంటర్ వరకు జాతీయ రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బార్ అసోషియేషన్ అధ్యక్షులు దాసరి సత్యనారాయణ, సెక్రటరీ ఆర్. మన్నేశ్వరరావు, ఏజీపీ టి.శాంతిసుధ, డి.ఆంజనేయులు, గ్రంధి రామారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వీరేశ్వరునికి అన్నాభిషేకం



స్వామికి అన్నంతో అభిషేకించిన దృశ్యం



లక్షపత్రి పూజలో పాల్గొన్న భక్తులు

తాళ్లరేవు: పవిత్ర కార్తికమాసం సందర్భంగా సుంకరపాలెంలోని పురాతన శివాలయంలో శుక్రవారం లక్ష పత్రి పూజను వైభవంగా నిర్వహించారు. భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్రీకంఠం భీమేశ్వర శర్మ నేతృత్వంలో టీటీడీ వేద పండితులు, ముక్తేశ్వరానికి చెందిన అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని శిష్య బృందంచే పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అన్నంతో అభిషేకించారు. లక్షబిల్వార్చన, భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉప్పునీటి బోర్లు తొలగించండి

మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు

అల్లవరం: ఉప్పు నీటి బోర్లతో వ్యవసాయ భూములు పాడైపోతున్నందున వాటిని తొలగించవలసి ఉందని మత్స్యశాఖ జేడీ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. అల్లవరం మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఆక్వా రైతులు, వ్యవసాయదారులతో శుక్రవారం సమావేశమయ్యారు. గోడిలంక, మొగళ్లమూరు గ్రామాలకు చెందిన రైతులు ఉప్పునీటి బోర్లు ఏర్పాటు చేసుకొని ఆక్వా సాగు చేస్తుండడంతో తుమ్మలపల్లి గ్రామానికి చెందిన నాగాబత్తుల గణపతిరావు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు జేడీ తుమ్మలపల్లి గ్రామంలో ఆక్వా సాగు చేస్తున్న రైతులతో సమావేశమైయ్యారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉప్పునీటి బోర్లు తొలగించాలన్నారు. వీటి స్థానంలో కాలువ నీటితో చేపల సాగు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ నరసింహారావు నేతృత్వంలో మత్స్యశాఖ, అగ్రికల్చర్, సర్వేయర్, అధికారులతో నిజ నిర్ధారణ కమిటీ వేసి పూర్తి స్థాయిలో విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, ఎఫ్‌డీఓ అశ్వని, వీఆర్ఓ మురళీ పాల్గొన్నారు.



ఆక్వా రైతులకు సూచనలు చేస్తున్న జేడీ శ్రీనివాసరావు

అంకితభావంతో విధులు చేపట్టండి

- అధికారులకు ఎమ్మెల్యే అశోక్ సూచన
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు

యానాం: ప్రభుత్వ శాఖల్లో అధికారుల పనితీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వివిధ శాఖల కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కోన వెంకటరత్నంనగర్‌లో రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో అక్కడ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయిస్తే మాజీ మంత్రి అనుచరుడు పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సౌకర్యాలు కల్పిస్తుంటే అడ్డుకోవడం తగదని ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్ హితవు పలికారు. రెవెన్యూ శాఖ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు రావడంతో ఆ శాఖను ఆకస్మిక తనిఖీ చేశారు. సోషల్ వెల్ఫేర్ శాఖను సైతం ఆకస్మిక తనిఖీ చేశారు. వికలాంగుల పింఛన్లు మంజూరుకు ఆదేశాలిచ్చినా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని సిబ్బందిపై ఆగ్రహం వెలిబుచ్చారు. నవంబర్ 15 నుంచి 18 లోగా సమావేశాలు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు పింఛను అందజేయాలని ఆదేశించారు. ప్రజాసేవే లక్ష్యంగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. ఆయనను పలువురు అధికారులు అనుసరించారు.



రెవెన్యూ కార్యాలయం అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

పాఠశాల నిర్వహణ భేష్

అమలాపురం రూరల్: మండలంలోని సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను విదేశీ విద్యావేత్తలు శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో విద్యాపరమైన అంశాలపై నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలుసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యా విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నంద్యాల మనువిహార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలలో తరగతులు పరిశీలిస్తున్న విదేశీ విద్యావేత్తలు

పాఠశాలకు క్రీడా పరికరాల అందజేత

ఐ.పోలవరం: మండల పరిధిలోని జి.వేమవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు స్థానికుడు నడింపల్లి సూర్యవర్మ రూ.65 వేలు విలువైన క్రీడా పరికరాలను అందజేశారు. సాఫ్ట్ బాల్, బేస్ బాల్, వాలీబాల్ ఆటలకు సంబంధించిన క్రీడా పరికరాలను హెచ్ఎం సలాది వెంకట్ నారాయణకు అందజేశారు. దాత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఈ పరిణామం శుభ సూచకమన్నారు. స్థానికంగా సరైన క్రీడా సదుపాయాలు లేక ప్రతిభావంతులైన క్రీడాకారులు వెనుకబడి పోతున్నారన్నారు. వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ఈ క్రీడా పరికరాలు అందజేయడం జరిగిందన్నారు. పీడీ జి.కళావతి, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరామ ప్రసాద్ పాల్గొన్నారు.



క్రీడా పరికరాలు అందజేస్తున్న దాత సూర్యవర్మ

మహిళను వెంబడించి బంగారం చోరీ

చాకచక్యంగా కాజేసిన దొంగల ముఠా

అమలాపురం టౌన్: స్థానిక దేవాంగుల వీధిలోని గోల్డ్ మార్కెట్‌లో ఓ మహిళ బంగారం కొనుగోలు చేసి బ్యాగ్‌లో పెట్టుకొని వెళుతున్న సమయంలో ముగ్గురు వ్యక్తులతో కూడిన దొంగల ముఠా చాకచక్యంగా అపహరించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల మేరకు అల్లవరం మండలం యెంట్రికోనకు చెందిన ఓ మహిళ స్థానిక బంగారు దుకాణంలో అరకాసు బంగారం కొనుగోలు చేసింది. ఆ పాట్లాల్ని తన బ్యాగ్‌లో పెట్టుకొని తిరిగి తన సొంతూరు బయలుదేరింది. ఆమె బంగారం కొనుగోలు చేసిన లగాయితు ఆమెను గమనిస్తున్న ముఠా ఆమె వెంట పడింది. ఇద్దరి మహిళలు, ఒక కుర్రాడితో కూడిన ముఠా ఆ మహిళను వెనుక నుంచి వెంబడించింది. ఆమె కన్నుగప్పి బ్యాగ్‌లోని బంగారాన్ని కాజేసి అక్కడ నుంచి క్షణాల్లో అదృశ్యమయ్యారు. బంగారాన్ని పోగొట్టుకున్న మహిళ స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

స్వయం సహాయక సంఘాల ఆడిట్‌పై శిక్షణ

తాళ్లరేవు: స్వయం సహాయక సంఘాలను ఆడిట్ చేసేందుకు గానూ ఐదు మండలాలకు నియమించిన 60 మంది సీఆర్‌పీలకు రిసోర్స్ పర్సన్, లీగల్ కోఆర్డినేటర్ తాడి మురళీకృష్ణ శిక్షణ ఇచ్చారు. కోరంగి పంచాయతీ సీబీవీ పాలెం గోదావరి మహా సమాఖ్య కార్యాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. సంఘాలను ఆడిట్ చేయడం ద్వారా నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుందని తద్వారా నిధులను సమర్థవంతంగా వినియోగించుకొని మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు అవకాశం ఉంటుందని శిక్షణలో వివరించారు.



సీఆర్‌పీలకు శిక్షణనిస్తున్న రిసోర్స్ పర్సన్ మురళీకృష్ణ

15 నుంచి సీపీఎం 'ప్రజాపోరు'

అమలాపురం టౌన్: సీపీఎం పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 8 నుంచి 15 వరకూ ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టనున్నట్లు పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రజాపోరు పేరుతో నిర్వహించే ఈ నిరసన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులు శుక్రవారం విడుదల చేశారు. జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపైనే ఈ పోరు సాగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 14న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ ప్రతినిధులు కె.కృష్ణవేణి, జి.దుర్గా ప్రసాద్, నూకల బలరాం, టి.నాగవరలక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు కె.ప్రణీత్, శశి శంకర్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు వేట నష్ట పరిహారం మంజూరు

యానాం: గోదావరిలో ఓఎన్‌జీసీ సంస్థ రెండవ గ్యాస్ పైపులైను నిర్మాణం నేపథ్యంలో వేట నష్టపోయిన మత్స్యకారులకు సంబంధిత సంస్థ నష్ట పరిహారం మంజూరు చేసిం దని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. గతంలో వివిధ సాంకేతిక కారణాల వల్ల వీరికి పరిహారం మంజూరు కాలేదని చెప్పారు. లబ్ధిదారులకు 24 నెలలకు గాను ఒక్కొక్కరికి రూ.2.81 లక్షల పరిహారం మంజూరైనట్లు తెలిపారు. 231 మందికి రూ.6.31 కోట్ల పరిహారం విడుదలైనట్లు వివరించారు.

ఆటో బోల్తా: పలువురికి గాయాలు

ఐ.పోలవరం: వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఐ.పోలవరం మండలం పశువుల్లంక మొండి వద్ద శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటనలో తొమ్మిది మంది వ్యవసాయ కూలీలకు గాయాలయ్యాయి. కె.గంగవరం మండలం శేరుల్లంకకు చెందిన వ్యవసాయ కూలీలు పనుల కోసం పాండిచ్చేరి, యానాం ప్రాంతాలకు వెళ్లారు. పనులు ముగించుకొని ఆటోలో తిరిగి వస్తుండగా పశువుల్లంక మొండి వద్ద ఎదురుగా వస్తున్న మోటార్ సైకిలిస్టును తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి ఆటో తిరగబడింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు ఛిద్రం



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి, అధికారులు

యానాం: జీవితాలను నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐలో నెహ్రూ యువకేంద్రం యానాం శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను పెడద్రోవ పట్టిస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అంతా పోరాడాల్సిన ఆవశ్యకతను వివరించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక చట్టం, శిక్షలు, ఆరోగ్యంపై వాటి ప్రభావం తదితర అంశాలను విశ్రాంత సీఐ గూటం శివగణేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిప్‌మెర్ ఆసుపత్రి మానసిక వైద్యురాలు డాక్టర్ ప్రేమ్‌సాయి, ట్రాఫిక్ ఎస్సై నూకరాజు, ఐటిఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణ సుధాకర్, కోఆర్డినేటర్ గోపి, వలంటీర్లు పాల్గొన్నారు.

లిక్కర్ పాలసీని పునఃసమీక్షించాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్‌లలో ప్రభుత్వం అమలు చేస్తున్న లిక్కర్ పాలసీ విధానాన్ని పునఃసమీక్షించాలని రాష్ట్ర లెఫ్ట్ పార్టీల కార్యదర్శులు ఆర్ రాజంగం, ఎం సలీమ్, బాల సుబ్రహ్మణ్యన్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా పుదుచ్చేరిలో బాలికలపై లైంగిక దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. ఇటీవల ముంబైకు చెందిన బాలికపై గ్యాంగ్‌రేప్, బాహూర్ ఏరియాలో బాలికపై లైంగిక వేధింపులు జరిగాయని దీనికి ప్రభుత్వ వైఫల్యంతో పాటు మాదక ద్రవ్యాలు విపరీతంగా పెరగడం కారణమన్నారు. పుదుచ్చేరిలో 2018లో నేరాలకు సంబంధించి 4వేల కేసులు నమోదు కాగా ప్రస్తుతం 6వేలకు పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో లిక్కర్ పాలసీని పునఃసమీక్షించాలని వారు డిమాండ్ చేశారు. నివాసాలు, విద్యా సంస్థలు, దేవాలయాలకు దగ్గరగా ఉన్న లిక్కర్ షాపుల మూసివేతకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



గోడి గురుకులంలో అవగాహన కల్పిస్తున్న సీఐ వీరబాబు

అల్లవరం: గోడిలోని బాలికల గురుకులంలో మహిళా సంరక్షణపై శుక్రవారం అమలాపురం టౌన్ సీఐ వీరబాబు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎస్సై హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఐ వీరబాబు మాట్లాడుతూ పాఠశాలలు, పని ప్రదేశాల్లో ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకోవాలన్నారు. మైనర్లకు రక్షణగా పోక్సో చట్టం ఉందన్నారు. కార్యక్రమంలో గురుకులం ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి



గంగుల బాబ్జీ(ఫైల్)

తాళ్లరేవు: సుంకరపాలెం వైఎస్సార్ సీపీ నాయకుడు గంగుల బాబ్జీ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం ఉదయం అనారోగ్యంగా కారణంగా కుటుంబ సభ్యులు యానాం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. ఈసీజీ తీసి వైద్యం చేస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో వైద్యులు కాకినాడ రిఫర్ చేశారు. అంబులెన్స్‌లో కాకినాడ తరలిస్తుండగా బాబ్జీ మృతి చెందారు. ఆయన మృతికి పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీను, నాయకులు కాశి లక్ష్మణస్వామి, వడ్డి ఏడుకొండలు తదితరులు సంతాపం వెలిబుచ్చారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు

యానాం: స్టేట్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ 2024-25లో భాగంగా పుదుచ్చేరి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నేడు, రేపు స్థానిక బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ శుక్రవారం తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో పుదుచ్చేరి, కారైకల్, మాహే, యానాం రీజియన్‌ల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు వివిధ క్రీడల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారని తెలిపారు. బాస్కెట్‌బాల్, బాల్ బాడ్మింటన్, ఖోఖో, బాడ్మింటన్ అంశాల్లో పోటీలు జరుగనున్నాయన్నారు. ఇప్పటికే క్రీడాకారుల కోసం వివిధ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పీఈటీలు పీవీఎస్ ప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి సన్యాసిరావు, చింతా వెంకన్న పాల్గొన్నారు.